## వివిధ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 7: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ(అప్లైడ్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ(స్పోర్ట్స్ న్యూట్రిషన్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు, దూర విద్యా ద్వారా అందించే ఎంబీఏ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలను ఈనెల 23వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. బీబీఏ, బీబీఏ(బిజినెస్ అనాలిటిక్స్), బీబీఏ (రిటైల్ ఆపరేషన్స్, లాజిస్టిక్స్, ఫ్యాషన్ మేనేజ్ మెంట్, ఫ్యాషన్ డిజైన్ మేనేజ్ మెంట్), బీకామ్, బీఏ, బీఎస్సీ, బీఎస్‌డబ్ల్యూ తదితర అన్ని డిగ్రీ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు తెలి పారు. పూర్తి వివరాలు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### కోర్సుల ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ తెలిపారు. దీంతో పాటు బీఫార్మసీ అన్ని సెమిస్టర్ల రివాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేశామన్నారు.

### పరీక్షల ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ తెలిపారు. బీసీఏ మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలతో పాటు దూరవిద్యా విధానంలో అందించే పీజీ డిప్లొమా ఇన్‌డేటా సైన్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈనెల10వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, రూ.200 అపరాధ రుసుముతో 13వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. జవాబుపత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ. 1000 చెల్లించి ఈనెల 10వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు గడువు పొడిగింపు

ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ గడువును పొడిగించినట్లు ఓయూ కంట్రోలర్ తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర అన్ని కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈనెల 15వ తేదీ వర కు సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చని, రూ.500 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు.

## ఆటిజంపై అవగాహన వాక్

బంజారాహిల్స్, ఏప్రిల్ 7:చిన్నతనంలోనే ఆటిజం సమస్యలను గుర్తించి సరైన చికిత్సను అందించేలా తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుకోవాలని దివీస్ ల్యాబ్ మేనేజింగ్ డైరెక్టర్ డా.మురళీకృష్ణ అన్నారు. ఆదివారం బం జారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కువద్ద దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన వాక్ నిర్వహించారు. ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వాక్‌లో డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రాథమిక దశలోనే పిల్లల్లో ఆటిజం లక్షణాలను గుర్తించాలన్నారు. సాధారణంగా పిల్లల్లో ఉండాల్సిన చురుకుదనం కనిపించకపోతే తక్షణమే వైద్యులను సంప్రదించాలని సూచించారు. తమ సంస్థ తరపున ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తుంటామన్నారు. దివీస్ ల్యాబ్ ఈడీ ఎన్వీ రమణ, సీఎఫ్‌వో ఎల్.కిశోర్ బాబు, ప్రకాశ్‌దివి, రమేశ్‌బాబు, మధుబాబు, సుబ్బారా వు, వరప్రసాద్, సుధాకర్‌పాటు వాకర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

కోకాపేటలో ఓఆర్ఆర్‌పై నియోపోలిస్ లేఅవుట్‌ను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న ట్రంపెట్

# వేగంగా కోకాపేట ఓఆర్ఆర్ ట్రంపెట్ నిర్మాణం

## త్వరలో అందుబాటులోకి మరో ఇంటర్‌చేంజ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): ఐటీ కారిడార్‌లో గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. ఐటీ కారిడార్‌ను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దే క్రమంలో గత కేసీఆర్ ప్రభుత్వం కోకాపేటలో సుమారు 534 ఎకరాల విస్తీర్ణంలో కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చేపట్టింది. ఇందులో భాగంగానే కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌ను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న ఓఆర్ఆర్ ట్రంపెట్ పనులు చివరి దశలో ఉన్నాయి. ఐటీ కారిడార్‌లో అత్యాధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఇప్పటికే భారీ బహుళ అంతస్థుల నిర్మాణాలు మొదలయ్యాయి. దానికి అనుగుణంగానే లేఅవుట్‌లో రోడ్డు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వీధిదీపాలు, ల్యాండ్ స్కేపింగ్ వంటి పనులను కాంట్రాక్టు సంస్థ పూర్తి చేసింది. ఇదే లేవుట్‌ను కలుపుతూ ఔటర్ రింగు రోడ్డు మీదకు నేరుగా వెళ్లేందుకు, వచ్చేందుకు ఓఆర్ఆర్‌పై ట్రంపెట్ నిర్మాణం చేపట్టింది హెచ్ఎండీఏ. ట్రంపెట్ నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయి. త్వరలోనే బ్రిడ్జీ నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. కొత్తగా అభివృద్ధి చేసిన ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు విశాలమైన రోడ్లు, అనుసంధాన రోడ్లను నిర్మిస్తున్నామని అధికారులు తెలిపారు. ముఖ్యంగా కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌లో 50 నుంచి 60 అంతస్తులతో కూడిన ఆకాశహార్మ్యాలే అధికంగా నిర్మాణం అవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ఓఆర్ఆర్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వైపు సాఫీగా వెళ్లేందుకు వీలుగా ఈ ట్రంపెట్‌ను నిర్మిస్తున్నామని, త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు తెలిపారు.

# వ్యాయామంతో ఆరోగ్యం

### ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 7 : ప్రతిరోజు వ్యాయామం, నడక, యోగాసాధనకు సమయాన్ని కేటాయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కూకట్‌పల్లిలోని మైహెల్త్ వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే మారథాన్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, వైద్యశాల డైరెక్టర్ కృష్ణ చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేటి సమాజంలో ఆడవాళ్లు ఎక్కువగా గైనకాలజీ, పురుషులు గుండె సమస్యలతో బాధపడుతున్నారన్నారు. రోజు వారి జీవన విధానంలో వ్యాయామం, నడకకు సమయాన్ని కేటాయించకపోవడం వల్ల బరువు పెరిగి గుండె, కిడ్నీ సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను కచ్చితంగా పాటించాలన్నారు. మితహారం, నిత్యం వ్యాయామం, యోగా సాధనతో ఆరోగ్యవంతులుగా జీవించాలన్నారు. అనంతరం మారథాన్‌లో విజేతలుగా నిలిచిన కిరణ్, శ్రీనివాస్‌లను సన్మానించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ స్నేహా రెడ్డి, జయంత్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, అన్వేష్ చౌదరి, భాస్కర్‌రావు, శిరీష, వైద్యశాల సిబ్బంది ఉన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో 5కే మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ, వైద్యశాల డైరెక్టర్ కృష్ణచైతన్య తదితరులు

## పాదచారుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

### జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి వెల్లడి

జలమండలి ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎండీ సుదర్శన్‌రెడ్డి

సిటీబ్యూరో, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): వేసవి దృష్ట్యా పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు జలమండలి సిద్ధమైంది. ఇందులో భాగంగా చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. బసవతారకం, మెహిదీపట్నం రైతుబజార్ దగ్గర ఏర్పాటు చేసిన చలివేంద్రాలను జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. పెరుగుతున్న ఎండ తీవ్రతతో నగరంలోని పాదచారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చాలని జలమండలి నిర్ణయించినట్లు ఎండీ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. నగరంలోని పలు ఆసుపత్రులు, బస్టాండ్‌లు, జన సంచారం ఎక్కువగా ఉండే ఇతర ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విడతల వారీగా మిగతా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. రాబోయే కాలంలో జలమండలి ఏర్పాటు చేసిన చలివేంద్రాలకు మంచి ఆదరణ వస్తే వాటిని ఏడాది పొడగునా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎండీ వెల్లడించారు. ఏవైనా స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు వస్తే వారికి ట్యాంకర్ ద్వారా ఉచితంగా నీరు సరఫరా చేస్తామని, ఇందుకు ఆయా డివిజన్ల అధికారులను సంప్రదించాలని సూచించారు. రంజాన్ నేపథ్యంలో మసీదులు ఉన్న ప్రాంతాల్లో నీటి సరఫరా, మురుగునీటి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అజ్మీరా కృష్ణ, సీజీఎం వినోద్ భార్గవ, జీఎం హరిశంకర్, మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

### వంద శాతం చెత్త సేకరణకు వీక్లీ యాక్షన్ ప్లాన్

### అవగాహన ర్యాలీలు, రంగోళి, బస్తీ సమావేశాలు

### చెత్త కుప్పలను తగ్గించడం, స్వచ్ఛ ఆటోకు వ్యర్థాలను ఇచ్చేలా క్యాంపెయిన్

### ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్న జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): వంద శాతం ఇంటింటికీ చెత్త సేకరణే లక్ష్యంగా జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ప్రత్యేక కార్యాచరణ అమలుకు శ్రీకారం చుట్టారు. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజి వనరేబుల్ పాయింట్లు/జీవీపీ)పై యాక్షన్‌ప్లాన్ రూపొందిస్తున్నారు. గ్రేటర్‌లో డస్ట్ బిన్‌లు ఎత్తివేసి.. స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటికి చెత్త సేకరణ ప్రక్రియ జరుపుతుండగా.. అక్కడక్కడ కొందరు బహిరంగంగానే చెత్త వేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చెత్తకుప్పలను తగ్గించడం, ప్రతిఒక్కరూ వ్యర్థాలను స్వచ్ఛ ఆటోకు ఇచ్చేలా అవగాహన కల్పించడమే లక్ష్యంగా బస్తీ కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నారు. ఈ మేరకు గడిచిన వారంరోజుల యాక్షన్ ప్లాన్‌లో బస్తీ సమావేశాలు, స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వని గృహాలు, బస్తీలలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు, తరచూ చెత్త వేసే ప్రాంతాల్లో చెత్త మళ్లీ వేయకుండా రంగోళి(ముగ్గులు), టౌన్ వెండింగ్ కమిటీ మీటింగ్, ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. ఈ క్రమంలోనే వారం రోజుల బస్తీ కార్యాచరణతో సాధ్యమైన ఫిర్యాదులను వివరించారు. క్షేత్రస్థాయి సమావేశాలతో 1,87,752 ఇండ్ల యజమానులు స్వచ్ఛ ఆటోలకు చెత్త ఇవ్వట్లేదని తేలిందని కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. వారితో మాట్లాడి 1.4 లక్షల ఇండ్లను స్వచ్ఛ ఆటోతో అనుసంధానం చేసినట్లు తెలిపారు. ఆటోలకు చెత్త ఇవ్వకుండా రోడ్లపై పడేస్తే జరిమానా తప్పదని కమిషనర్ హెచ్చరించారు.

## రేవంత్ కంటే కేసీఆర్ పాలనే బాగుంది

### ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

**రాహుల్‌గాంధీకి బహిరంగ లేఖ రాసిన దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్**

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 7: తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన కంటే కేసీఆర్ పరిపాలనే బాగుండేదని దళిత క్రైస్తవ దండోరా జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. దళితుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. తార్నాకలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి బహిరంగ లేఖ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ ముత్తాత నెహ్రూ, నాయనమ్మ ఇందిరా గాంధీ, నాన్న రాజీవ్ గాంధీ, అమ్మ సోనియా గాంధీ వరకు దేశంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుదీర్ఘకాలంగా పరిపాలించింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. కానీ.. దేశంలో 50 కోట్ల మంది దళితుల సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ నాయకులు విఫలం చెందారని ఆరోపించారు. తెలంగాణలో రెడ్ల పాలన కొనసాగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఒకే ఒక్క పదవి దక్కగా, దళిత క్రైస్తవులకు ఇవ్వాల్సిన క్రైస్తవ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవి సైతం అగ్రవర్ణానికి చెందిన వారికే ఇచ్చారని మండిపడ్డారు. మూడు పార్లమెంట్ స్థానాల్లో మాదిగలకు తీరని అన్యాయం చేసి, దళితుల్లో మైనార్టీలైన మాలలకు అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని వాపోయారు. ఇది సామాజిక న్యాయానికి, ప్రజాపాలనకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. రేవంత్‌రెడ్డిని ఆర్ఎస్ఎస్ ఏజెంట్‌గా ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ బహిరంగంగానే విమర్శిస్తున్నారని గుర్తు చేశారు. బీజేపీ కంటే కాంగ్రెస్‌లోనే ఆర్ఎస్ఎస్ ఏజెంట్లు ఎక్కువగా ఉన్నారని ఆరోపించారు. ఆ కారణంగానే పాంచ్ న్యాయ్ పేరుతో సామాజిక న్యాయానికి తూట్లు పొడిచే విధంగా ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి వారు భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య పరిపాలనను అందిస్తానంటే బహుజనులు ఎలా నమ్మాలని ప్రశ్నించారు.

## గ్రేటర్ @41డిగ్రీలు

సిటీబ్యూరో,ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు వేడెక్కిస్తున్నాయి. ఈ సంవత్సరం వేసవి కాలంలోనే ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు 41.0డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 27.7డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 24శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఎండల తీవ్రత కారణంగా పగలు సమయంలో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. దీనివల్ల మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నగర రోడ్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. రానున్న రెండుమూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు 42డిగ్రీలు దాటే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

## రాష్ట్రపతి నిలయంలో ఉగాది వేడుకలు

బొల్లారం రాష్ట్రపతి నిలయంలో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బుద్రా వెంకటేశం గవర్నర్ కార్యదర్శి, కల్పన రమేశ్ సీఈఓ రెయిన్ వాటర్ ప్రాజెక్టు, పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వీసీ టి.కిషన్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కళా ప్రదర్శనలతో, వివిధ నృత్య కళాశాలల విద్యార్థులు అలరించారు. అనంతరం విజయనాథ్ పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయం అధికారి రజినీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు ఆకట్టుకున్నాయి. – బొల్లారం, ఏప్రిల్ 7

# పాత, కొత్త కలుస్తారా?

### ఖైరతాబాద్ కాంగ్రెస్‌లో విభేదాలు - రంగంలోకి సీఎం రేవంత్

సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని ముఖ్యనాయకులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి

బంజారాహిల్స్,ఏప్రిల్ 7: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు టికెట్ కేటాయించడంతో నేతల మధ్య విభేదాలు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా ఉన్న పీజేఆర్ కుమార్తె పి.విజయారెడ్డి, దానం నాగేందర్ కలిసి పని చేయాల్సి రావడాన్ని వారి అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో పాత కాంగ్రెస్ కార్యకర్తలు, కొత్త కార్యకర్తలు అనే చీలక ఏర్పడింది. తాజాగా శనివారం నిర్వహించిన తుక్కుగూడ జన జాతర సభ ఖైరతాబాద్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నేతల మధ్యన విభేదాలను మరోసారి తెరపైకి తెచ్చింది. విజయారెడ్డి నాయకత్వంలో ఐమాక్స్ వద్ద నుంచి కార్యకర్తలు సభకు తరలివెళ్లగా, ఎమ్మెల్యే దానం నాగేందర్ నాయకత్వంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు ఫిలింనగర్ నుంచి వేరుగా సభకు వెళ్లారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా గెలిస్తే వచ్చే ఉప ఎన్నికల్లో టికెట్ ఖచ్చితంగా విజయారెడ్డికే వస్తుందని ఆమె వర్గీయులు చెబుతుండగా, దానం నాగేందర్ కుటుంబ సభ్యులకు టికెట్ ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చారంటూ ఆయన వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. దీంతో నేతల మధ్యన విభేదాలు పరిష్కరించేందుకు ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. ఆదివారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులతో సమావేశమైన సీఎం రేవంత్ కలిసి పనిచేయాలని సూచించారు. సమావేశంలో సైతం విజయారెడ్డి, దానం నాగేందర్ ఎడమొహం పెడమొహంగానే ఉండడంతో ఈ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో అని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

## పీవీ నా తండ్రి కావడం గర్వకారణం

### ఎమ్మెల్సీ సురభి వాణిదేవి



ఆచార్య చెన్నకేశవ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

రవీంద్రభారతి,ఏప్రిల్ 7:జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు ఆచార్య జి.చెన్నకేశవరెడ్డి 80వ జన్మదినం సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్‌కు పురస్కారం సగౌరవ సమర్పణ కార్యక్రమం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ సురభి వాణిదేవి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం అంపశయ్య నవీన్, కవి ఎలనాగ, ఆచార్య చెన్నకేశవరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశానికే గర్వకారణమైన మహోన్నత వ్యక్తి పీవీ నరసింహారావు అని, ఆయన తన తండ్రి కావడం తనకు గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పి.వి.ప్రభాకర్‌రావు, రామకృష్ణారావు, ఆచార్య లక్ష్మీనారాయణ, ఎస్‌టి సురేందర్‌రావు, ఎం.శంకర్‌రెడ్డి, నాళేశ్వరం శంకరం తదితరులు పాల్గొన్నారు.

## 13న బీఆర్ఎస్ బహిరంగ సభ

### చేవెళ్ల సభకు లక్షలాదిగా తరలిరావాలి: ఎంపీ అభ్యర్థి కాసాని, ఎమ్మెల్యే గాంధీ

సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి కాసాని. చిత్రంలో ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ , ఏప్రిల్ 7 : చేవెళ్లలో ఈనెల 13న నిర్వహించనున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ విజయవంతం చేయాలని, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కోరారు. ఈ మేరకు నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నివాసంలో కార్పొరేటర్లు హమీద్ పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, జూపల్లి సత్యనారాయణ, నార్నె శ్రీనివాస్‌రావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాధవరం రోజాదేవి, మాజీ కార్పొరేటర్లు సాయిబాబా, రంగారావు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, అభ్యర్థి కాసానితో కలిసి ఎమ్మెల్యే గాంధీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవ చేసిన అనుభవం తనకున్నదని, తనను ఎంపీ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారని తెలిపారు. ప్రజలందరినీ ఏకం చేసి అధిక మెజార్టీతో గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇస్తానన్నారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటామని ముక్తకంఠంతో ప్రజాప్రతినిధులు, ప్రజలు చెబుతున్నారన్నారు. పార్టీ శ్రేణులు సైనికుల్లా కృషి చేయాలని, కాంగ్రెస్ బీజేపీ మైఫల్యాలను ప్రజలకు వివరించి వారి మద్దతును కూడగట్టాలని కోరారు. ఈ నెల 13న కేసీఆర్ సభకు లక్షలాదిగా ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మోహన్ గౌడ్, గణేశ్ ముదిరాజ్, సంజీవరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గౌతం గౌడ్, కిరణ్‌యాదవ్, రాజునాయక్, లక్ష్మీనారాయణ, భాస్కర్, హరీశ్ రావు, పెద్ద భాస్కర్‌రావు, లక్ష్మారెడ్డి, గంగాధర్, భిక్షపతి, రాజేందర్, వేణు, గణేశ్, కాశీనాథ్, శ్రీను, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిపక్ష నేతలపై బూటకపు కేసులు, అరెస్టులు

## మోదీ నియంతృత్వానికి నిదర్శనం

### ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బిడ్డి సుధాకర్

ఇందిరాపార్కు ధర్నాచౌక్ దీక్షలో మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర కన్వీనర్ డా.సుధాకర్

కవాడిగూడ, ఏప్రిల్ 7: చట్ట విరుద్ధంగా ప్రతిపక్ష నేతల నిర్భంధం ప్రజాస్వామ్య వ్యవస్థకే ముప్పు అని 'ఇండియా' కూటమి నేతలు తెలిపారు. ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలు బీజేపీకి రాజకీయ ఆయుధాలుగా పనిచేస్తున్నాయని, ప్రతిపక్ష నేతలపై నిర్దాక్షిణ్యంగా దాడులు, బూటకపు కేసులు, అరెస్టులు ప్రధాని మోదీ నయా నియంతృత్వానికి నిదర్శనమని వారు చెప్పారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును వ్యతిరేకిస్తూ దేశ వ్యాప్త సామూహిక నిరాహార దీక్షలు చేపట్టాలని ఆప్ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఆప్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వందలాది మంది ఆప్ శ్రేణులతో సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ డిడ్డి సుధాకర్ నేతృత్వంలో జరిగిన ఈ సామూహిక నిరాహార దీక్షలకు తెలంగాణ రాష్ట్ర ఇండియా కూటమి నేతలు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ బలమూరి వెంకట్, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్ బాలమల్లేశ్, సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఆర్